క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మల్దకల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుజాత, తక్కశిల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు సుమతి, మారమునగాల–2 గ్రామంలోని పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీరాములు బోధన అభ్యసన కృత్యాల ద్వారా చక్కగా బోధించినందుకు కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగా ఎంఈఓ శివప్రసాద్ పాఠశాలలకు వెళ్లి వారిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, హెచ్‌ఎం సూరయ్య, సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి ఆరోపించారు. గురువారం వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

నవోదయలో మెరిసిన విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సరస్వతి పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు మహేష్ చంద్ర, అభిరానందన్ లు ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులను సాధించి వట్టెం గల జవహర్ నవోదయ పాఠశాలలో సీట్లను సాధించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

దారి మళ్లింపు

అయిజ: అయిజ నుంచి గద్వాల వెళ్లే ప్రధాన రహదారిలో పెద్దవాగు బ్రిడ్జి మరమ్మతు కారణంగా గురువారం రాకపోకలను మళ్లించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న వాహనదారులు సమీపంలోని వాగుపై రాకపోకలు సాగించాలని, కర్నూల్ నుంచి వచ్చే వాహనదారులు అప్పల్ రోడ్డు ఎదురుగా ఉన్న రహదారి గుండా ఎస్సీ కాలనీ ఓల్డ్ పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లాలని ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

మానవపాడు: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు వచ్చేనెల రెండో తేదీలోగా రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన చిన్న బుడ్డన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ఆర్.కిశోర్ గురువారం పుటాన్‌దొడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నాయకులు సత్యరాజ్, డేవిడ్, దేవన్న, దేవదాస్, నాగన్న, ఏసన్న, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

విద్యా వలంటీర్లను రెన్యూవల్ చేయండి

ధరూరు: జిల్లాలోని 630 మంది విద్యా వలంటీర్లను వెంటనే రెన్యూవల్ చేయాలని విద్యా వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, రఘులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. విద్యా దినోత్సవం సందర్భంగా ఐటీ మంత్రి కేటీఆర్ విద్యా వలంటీర్ల రెన్యూవల్‌పై హామీ ఇచ్చారని, అయినా ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.



గద్వాలలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు



అలంపూర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్ కుమార్



కేటీదొడ్డిలో..



రాజోళిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ మరియమ్మ

అమరులారా వందనం

గద్వాల అర్బన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. అమరవీరుల ఆశయాల సాధనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. అదేవిధంగా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకు ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో బహుజన రాజ్యసమితి, ఐఎఫ్‌టీయూ, బీఎస్పీ, జనసేన, దళిత ఐక్యవేదిక, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు వాల్మీకి, ఆంజనేయులు, ఇక్బాల్ పాషా, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకట్ రెడ్డి, మోహన్, మద్దిలేటి, రాజు, వినోద్ కుమార్, కోళ్ల ఉస్సేన్, తదితరులు ఉన్నారు.

అలంపూర్: పట్టణంలోని ఐకేపీ భవనంలో ఎంపీపీ బేగం, వైస్ ఎంపీపీ అనురాధ, ఎంపీఓ చంద్రకళ, ఎంఈఓ అశోక్ కుమార్ అమరుల త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

ధరూరు: మండల కంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ ఎండీ జబ్బార్‌లు తెలంగాణ అమరులకు నివాళులర్పించి త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్ శివలీల, ఎంపీఓ కృష్ణమోహన్, ఎంఈఓ సురేష్, పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తెలంగాణ అమర వీరుల స్థూపం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీలు శంకరమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రజిత, ఎంపీడీఓ రవీంద్ర, తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతన్న, ఏపీఓ విజయలలిత, ప్రజాప్రతినిధులు అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

రాజోళి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మరియమ్మ, ఎంపీడీఓ గోవిందు రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రెటరీలు అమరవీరులను స్మరిస్తూ రెండు నిమిశాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

గద్వాల: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అమరవీరుల చిత్రపటాలకు చైర్మన్ కేశవ్, కమిషనర్ నర్సింహులు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాల వద్ద ఎంపీపీ అశోక్‌రెడ్డి, కలుకుంట్లలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

అయిజ: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట టీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మౌనం పాటించారు.

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అమరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. అనంతరం అమరుల త్యాగాలను గుర్తించి ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశ పెట్టి ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రొ.జయశంకర్ చిత్రపటానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు.

మల్దకల్: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అమరవీరుల స్థూపం చిత్ర పటానికి ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ హరికృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.



గట్టులో తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



గద్వాలలో..



మానవపాడులో..



అయిజలో నివాళులర్పిస్తున్న కుర్వ పల్లయ్య



మల్దకల్‌లో..



ధరూరులో..

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పదో బెటాలియన్‌లో బహుమతులు ప్రదానం చేస్తున్న కమాండెంట్ రాంప్రకాష్



పుల్లూరు గురుకుల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 'తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి' అంశంపై వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాదినోత్సవంలో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, ఏటీపీ గీత, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం..

గట్టు: దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో పంచాయతీ కార్మికులను శాలువా, పూలమాలలతో సర్పంచ్ ధనలక్ష్మి ఘనంగా సన్మానించారు. తెలంగాణ అమర వీరులను స్మరించుకుని, నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి జగన్నాథరావు, కోఆప్షన్‌సభ్యుడు సత్యనారాయణ, రిటైర్డ్ హెచ్‌ఎం గోవిందప్ప, ఏఈఓ తోహిద్, టీఏ దొరబాబు, వార్డు సభ్యులు రమేష్, నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అన్యాయం



శాంతినగర్‌లో నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

శాంతినగర్: తెలంగాణ రాష్ట్ర సాధనలో 1200 మంది అమరులయ్యారని రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి కుటుంబాలను విస్మరించిందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు ఆరోపించారు. గురువారం వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో దశాబ్ది ఉత్సవాలను వ్యతిరేకిస్తూ అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఏ సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహన కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. కొద్దిసేపు పోలీసులు, బీఎస్పీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేస్తాం

గద్వాల అర్బన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గం నుంచి ఎంఐఎం నుంచి అభ్యర్థి బరిలో ఉంటారన్నారు. వచ్చే నెల నుంచి నియోజకవర్గంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో నాయకులు బంగి సుదర్శన్, అల్తాఫ్, రఫీ, రాజా, ఇమాముద్దీన్ ఉన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

కేటీదొడ్డి: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ శ్రీపాదరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలదిన్నెలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలను ఎలా లబ్ధిపొందాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగన్న, వార్డు మెంబర్ మహదేవ్, తిమ్మప్ప పాల్గొన్నారు.

అయిజ: మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ 19వ వార్డులో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం చేపట్టారు. వార్డులోని వల్లూరు పేట, పెద్ద ఆంజనేయస్వామి గుడి దగ్గర, సమీపంలోని ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, పోలింగ్ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, రాజు, హరి, జయసింహ, లతీఫ్, నితిన్‌లు పాల్గొన్నారు.

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికి బీజేపీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఎర్రవల్లి కూడలిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, శంకరెడ్డి, నరేంద్ర, తదితరులు ఉన్నారు.



కేటీదొడ్డి గువ్వలదిన్నెలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



అలంపూర్: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభాష్ నాయుడు హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. వాహనాలను నిలిపి అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. అనుమతి మేరకే ఇసుక తరలించాలని ట్రాక్టర్ యజమానులకు సూచించారు.

మీసేవా కేంద్రాల తనిఖీ



రాజోళి: మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాలను గురువారం తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల వద్దకు వచ్చిన వారితో మాట్లాడి ధ్రువపత్రాలకు ఎంత రుసుము చెల్లిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకే డబ్బులు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



అయిజ: ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి బయల్దేరిన కాంగ్రెస్ మండలనాయకులను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. తాండ్రపాడు చౌరస్తా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకులు షేక్షావళిఆచారి, జయన్న, మాస్టర్ మధు, మద్దిలేటి, బసవరాజు, రవీందర్, లక్ష్మన్న, వెంకటేష్, అంజిలు ఉన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

శాంతినగర్: వడ్డేపల్లి పుర పాలిక పరిధిలోని శాంతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను ఆ పార్టీ నాయకులు గురువారం దహనం చేశారు. అమరవీరుల స్థూపం వద్ద కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కాంగ్రెస్ నాయకులను చెదరగొట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

అలంపూర్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఇటిక్యాల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఈదన్న భార్య శేషమ్మ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందడానికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గురువారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీని ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకన్న, శివుడు తదితరులు ఉన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

పాఠ్య పుస్తకాల పంపిణీ



కేటీదొడ్డిలో హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్



ధరూరు ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట..

కేటీదొడ్డి: మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను మండల కేంద్రంలో గురువారం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. 6–10 వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశామని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్‌గౌడ్, ఎలీషా, రాకేష్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను ఎంఈఓ సురేష్ పంపిణీ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఆయా పాఠశాలల నుంచి వచ్చిన హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను అందజేశారు. ఆలస్యం చేయకుండా త్వరగా విద్యార్థులకు పుస్తకాలు అందించి విద్యాబోధనకు ఇబ్బంది లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గట్టు: అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. పేదలందరికి ఇండ్ల స్థలాలు, గృహలక్ష్మి పథకం కింద రూ.5.50 లక్షలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ జుబేర్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరవెంకట నర్సింహ, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఆంజనేయులు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద, హమాలీ సంఘం నాయకులు వీరన్న, వెంకటేష్, రెడ్డప్ప, ఉరుకుందు, బజారి, ఈరమ్మప్ప, లక్ష్మి, రాముడు పాల్గొన్నారు.

అలంపూర్: వరదల్లో నిరాశ్రయులైన నిర్వాసిత కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 2009 వరద బాధితులతో కలిసి గురువారం ధర్నా చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి అర్హులైన నిర్వాసితులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుభాష్ నాయుడికి వినతి పత్రం అందజేశారు. జూలై 3వ తేదీలోగా బాధితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.ఆశన్న, నాగరాజు, సిద్దయ్య, ఏలియా ఉన్నారు.



గట్టులో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు